నిబంధనలకు నిప్పు

- ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చేస్తున్న వైనం
- పెరిగిపోతున్న వాయుకాలుష్యం
- పట్టించుకోని యంత్రాంగం


డంపింగ్ యార్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కడియం: ప్లాస్టిక్ నియంత్రణ, నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. నిర్దేశిత ప్రమాణాలకంటే తక్కువ మైక్రాన్లు గల ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ, దాని గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రతి నిత్యం ఆవాస ప్రాంతాలు, వాణిజ్య సముదాయాల నుంచి వెలువడుతున్న చెత్తలో 80 శాతానికి పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో భారీ ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ యార్డులకు చేరుతున్నాయి. వీటిని తగులబెట్టడమే ధ్యేయంగా యంత్రాంగం వ్యవహరిస్తోంది. ఈ పని తీవ్రమైన వాయు కాలుష్యానికి దారితీస్తోంది. అంతిమంగా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇటీవల చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు అధికం కావడానికి వాయు కాలుష్యం ప్రధానమని వైద్యులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెట్టడం కారణంగా వాయు కాలుష్యం పెరుగుతోందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా షెడ్లు

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు నిర్దిష్ట ప్రణాళికలు ఉన్నాయి. వాటికి కేంద్ర ప్రభుత్వం కూడా నిధులను సమకూర్చుతోంది. అయితే కార్యాచరణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీలు సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ వ్యవహారంలో చేతులెత్తేస్తున్నాయి. గతంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రతి పంచాయతీ పరిధిలోనూ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు నిర్మించారు. అక్కడ తడి, పొడి చెత్తలను వేరుచేసేందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు. తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసి, అవసరమైన వారికి విక్రయించి ఆయా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాల్సి ఉంది. పొడి చెత్తను రీసైకిల్ చేయడానికి కార్యాచరణ ప్రకటించారు. అయితే ప్రస్తుతం సదరు షెడ్లన్నీ రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయని వాటి సమీప ప్రాంతాల్లోని వారు చెబుతున్నారు. దాదాపు వీటిని నిర్మించి పదేళ్లు కావొస్తున్నప్పటికీ సదరు షెడ్లు నిర్మించడానికి చేసిన ఖర్చులో పదో వంతు కూడా వీటి నుంచి ఆదాయం రాలేదంటున్నారు. ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తే సదరు వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల నుంచి ఉత్పత్తయిన ఎరువులను అమ్ముతున్నట్లు ప్రచారం మాత్రం పక్కాగా చేసుకుంటున్నారు.

నిధుల లేమి

జనావాసాల నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి సాలిడ్‌వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్లకు తరలించి, అక్కడ తదనంతర కార్యాచరణ అమలు చేయాల్సి ఉంది. అయితే ఇలా ఇళ్ల నుంచి చెత్తను విడివిడిగా సేకరించడానికి తగినంత నిధులు అందుబాటులో లేకపోవడం ప్రధాన లోపంగా చెబుతున్నారు. మధ్య స్థాయి గ్రామ పంచాయతీల పరిధిలో ఇళ్ల నుంచి ఇలా చెత్తను సేకరించి, వాటిని ఎరువుగా మార్చేందుకు దాదాపు పదిమంది వరకూ కార్మికులు అవసరమవుతారు. అయితే వీరి జీతాలు, నిర్వహణకు తగిన నిధుల మంజూరు కావడం లేదు. నిర్వహణాపరమైన నిధులు ప్రజల నుంచే సేకరించేందుకు కూడా యంత్రాంగం సిద్ధమైంది. అయితే ఈ పథకం పట్ల ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించకపోవడంతో చెత్తకు కూడా పన్ను వేస్తున్నారంటూ గత ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలకు దిగారు. అయితే అప్పట్లో విమర్శలు చేసినవారే ఇప్పుడు అధికారంలో ఉన్న నేపథ్యంలో ప్రజల నుంచి చెత్తపై పన్ను వసూలు చేయకుండా సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను లాభదాయకంగా ఏ విధంగా నిర్వహిస్తారన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రజారోగ్యానికి ఇబ్బందే

ఒకవేళ పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజారోగ్యానికి గొడ్డలిపెట్టుగా మారుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో చెత్తను కనిపించకుండా ప్రభుత్వ యంత్రాంగం శతవిధాలా ప్రయత్నిస్తోంది. కానీ ప్రతి గ్రామం ప్రారంభంలోనూ కొండల్లా దర్శనమిస్తున్న చెత్తకు శాశ్వత పరిష్కారాన్ని మాత్రం చూపడం లేదు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం చెత్త, తద్వారా ప్రజారోగ్యంపై పడే ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ సక్రమంగా ఉండాలి

సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలి. చెత్త సేకరణ, తరువాత దాన్ని పర్యావరణానికి ప్రమాదం లేకుండా డీకంపోజ్ చేయడంపై దృష్టి పెట్టాలి. చెత్తే కదా అని నిర్లక్ష్యం వహించడానికి లేదు. ఇళ్ల నుంచి పోగయ్యే చెత్త చివరికి ప్రజారోగ్యంపైనే ప్రభావం చూపుతోంది.

– కె.శ్రీను, కడియం

శాశ్వత పరిష్కారం

ప్రతి రోజూ ఒక్కో గ్రామం నుంచి టన్నుల్లోనే చెత్త పోగవుతుంది. ఈ చెత్తలో అత్యధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. రకరకాల కారణాలతో చెత్త కుప్పలకు తగులబెడుతున్నారు. దీని కారణంగా గాలి, నేల, సమీపంలోని నీరు కూడా కలుషితం అవుతోంది. ప్రమాదం లేకుండా చెత్తను మేనేజ్ చేయగలిగే శాశ్వత పరిష్కారం ఆలోచించి అమలు చేయాలి.

– వి.బాబ్జీ, దుళ్ల

క్లుప్తంగా

సెబ్ విస్తృత దాడులు

రాజమహేంద్రవరం రూరల్: సెబ్ నార్త్ స్టేషన్ పరిధిలోని క్వారీమార్కెట్ సిద్ధార్థ నగర్, లింగంపేటలలో సోమవారం అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా క్వారీమార్కెట్ సిద్ధార్థ నగర్‌కు చెందిన పట్నాల జయను అరెస్టు చేసి, ఆమె నుంచి 32 ఎంఎల్ డ్యూటీపెయిడ్ లిక్కర్‌ను, లింగంపేటలో పితా కుమారిని అరెస్టు చేసి, 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దాడులలో సెబ్ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నెక్సన్, ఎస్సై విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు అత్యంత ప్రాధాన్యం


తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్య పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నగర పాలక సంస్థ అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. లాలాచెరువు వాంబే కాలనీలో తాగునీటి పైపులైన్ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పైపులైన్ నిర్మాణం వల్ల వాంబే కాలనీలోని కుటుంబాలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. అలాగే డ్రైనేజీల్లో పూడికతీతను క్రమం తప్పకుండా శానిటేషన్ సిబ్బంది చేపట్టాలన్నారు.

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత


ఈవీఎంల గోడౌన్ వద్ద కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో చైత్రవర్షిణి

రాజమహేంద్రవరం సిటీ: ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లకు కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్‌లోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణితో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రతినెలా ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి తనిఖీలు చేపడుతున్నారు. ఆమె వెంట రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా ఫిజికల్ డైరెక్టర్, బోటనీ బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి తెలిపారు. సంబంధిత సబ్జెక్టుకు సంబంధించి పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, అర్హులైన వారు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. ఆగస్టు ఒకటో తేదీ ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కంబాలచెరువు: స్థానిక వీటీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న అంధ విద్యార్థులు శశి, రహమాన్, నరేష్‌లకు ఇంగ్లిషు అధ్యాపకుడు నల్లి రవికుమార్ యూనిఫాం బహూకరించారు. వీటిని సోమవారం ప్రిన్సిపాల్ కె.రాజా చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ విద్యార్థులు స్థానిక జియోన్ అంధుల వసతి గృహంలో కళాశాలలో చదువుకుంటున్నారు. చదువులో ప్రతిభ చూపుతున్న వీటికి యూనిఫాం, స్టడీ మెటీరియల్ అందజేశారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ అధికారులు ఫీల్డ్ విజిట్‌కు తప్పనిసరిగా వెళ్లాలన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు నిత్యం తమ వార్డు పరిధిలో పది ఇళ్లను సందర్శించి, వారితో మాట్లాడాలన్నారు. వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు నగరంలోని ఆక్రమణల వివరాలు సేకరించాలని, వార్డు శానిటేషన్ కార్యదర్శులు డ్రైన్లను పరిశీలించాలన్నారు. పెన్షన్ల పంపిణీ విషయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. కార్పొరేషన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి 29 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో గృహాలు, పారిశుధ్యం, పింఛన్లు, డ్రైనేజీలు, మురుగునీరు, ఇంటి పన్ను, వీధి దీపాలు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్‌ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఏడు అర్జీలు

స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై ఏడు అర్జీలు అందినట్టు రాజమహేంద్రవరం రెవిన్యూ డివిజనల్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. నిబంధనల మేరకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో వర్క్‌షాప్ ప్రారంభం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో బయోలాజికల్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో బేసిక్ జినోమిక్స్, బయో ఇన్ఫర్మేటిక్స్ అనే అంశంపై అధ్యాపకులు, విద్యార్థులకు రెండు రోజులు నిర్వహించే వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ మానవ మనుగడ ఆధునిక జీవశాస్త్ర పరిశోధనలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ రంగాలలో రాణించిన విద్యార్థులు జీవితంలో ఎదగడానికి ఎంతో అవకాశం ఉందన్నారు. బెంగళూరులోని బయోకార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. భవిష్యత్తులో ఆ సంస్థతో ఒప్పందం చేసుకుని, విద్యార్థులకు నైపుణ్యశిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమానికి బయోకార్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అంకిత కుమారి, బయోకార్ట్ మాలిక్యులర్ బయాలజిస్ట్ దిబ్యేందు బికాస్ హాజరయ్యారు.

ముంపు నీటిని తోడేందుకు ఓఎన్‌జీసీ సాయం


ఆవ చానల్ నీటిని తోడుతున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

ధవళేశ్వరం: గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద ఉన్న ఆవ చానల్ తాత్కాలిక పంపు హౌస్ వద్ద ఓఎన్‌జీసీ పంపులను అమర్చారు. ఆవ ఛానల్ నీరు ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. వరదల కారణంగా నీరు ముందుకు వెళ్లకపోవడంతో రామకృష్ణ నగర్, సావిత్రీ నగర్, నేతాజీ నగర్ ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో సాయిబాబా గుడి వద్ద పంపులను ఏర్పాటు చేశారు. అయితే మరింత వేగంగా నీటిని తోడేందుకు అధికారులు ఓఎన్‌జీసీని సహాయం కోరడంతో నర్సాపూర్ నుంచి ఓఎన్‌జీసీకి చెందిన ఒక మొబైల్ కంప్రెసర్, హైడిశ్చార్జ్ పంపును సోమవారం తీసుకువచ్చి అమర్చారు. దీని ద్వారా నీటిని వేగవంతంగా తోడవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఓఎన్‌జీసీ ఈడీ అసెట్ మేనేజర్ శాంతనుదాస్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ రాష్ట్ర సంస్థలకు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెర్రియ్య (ఫైల్)

కడియం: కడియపులంకలో మొక్కలు లోడు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఏ.వెర్రియ్య (42) అనే కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. దుళ్ల గ్రామానికి చెందిన వెర్రియ్య మొక్కల లోడింగ్ పనులకు వెళతుంటాడు. ఎప్పటిలాగే తోటి వారితో కలిసి మొక్కల ఎగుమతికి సోమవారం వెళ్లాడు. మొక్కలు లోడు చేస్తుండగా సమీపంలోని విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెర్రియ్యకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉత్సాహంగా వరల్డ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్


కార్యక్రమంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

కడియం: ఫొటోగ్రాఫిక్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, రాజమహేంద్రవరం ఫోటో ఆర్ట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన కడియం పల్ల వెంకన్న నర్సరీలో సోమవారం వరల్డ్ ఫొటోగ్రఫీ వర్క్ షాప్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. నర్సరీ రైతులు పల్ల వీర వెంకట సత్యనారాయణ మూర్తి, సుబ్రహ్మణ్యం, గణపతి, వెంకటేష్, వినయకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పోర్ట్రియేట్ టెక్నిక్స్, కాంపోజిషన్, ఎక్స్ పెరిమెంటల్ ఫొటోగ్రఫీ, మోడల్ షూట్ అంశాలపై అవగాహన కల్పించారు. ఫొటోగ్రఫీలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఫొటోగ్రాఫిక్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రా అధ్యక్షుడు ముసిని వెంకటేశ్వరరావు(బాబులు), సెక్రటరీ జి.రామకృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ కార్యదర్శి కె.సుధాకరరెడ్డి, ఫొటో ఆర్ట్ క్లబ్ కార్యదర్శి టి.వీరభద్రరావు, కడియం ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ యూనియన్ అధ్యక్షుడు బి.మల్లికార్జునరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణచౌదరి, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్టేట్ బీచ్ కబడ్డీ పోటీలకు రవిరాజ్

ప్రకాశం నగర్: ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న నెల్లూరులో జరగబోయే మెన్స్ కబడ్డీ ఓపెన్ స్టేట్ పోటీలకు ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థి రవిరాజ్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ రాజబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించిన పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

మనిషి అత్యాశతోనే పర్యావరణ విధ్వంసం


ముఖ్యఅతిథి యూసఫ్ బాషాను సత్కరిస్తున్న అధ్యాపకులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, జంతుశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ పంచభూతాలను కలుషితం చేయడం వల్లనే భూతాపం పెరిగి అనేక వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ షేక్ యూసఫ్ బాషా మాట్లాడుతూ మానవుని అత్యాశ, ఆలోచనారాహిత్యాలే ప్రకృతి విధ్వంసకారకాలన్నారు. యువత పర్యావరణ హితమైన జీవితాన్ని అవలంబించి, ప్రకృతి సమతుల్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం యూసఫ్ బాషాను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ ఎం.సుధామయి, డాక్టర్ మాధవ్, వాణి, అలేఖ్య, సుబ్బారావు, మీనాక్షి, ఫణీంద్ర, వెంకటేష్, షేక్ మదీనా పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు విందు భోజనం

కడియం: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో 'శుభ దిన్ తిథి భోజనం' కార్యక్రమాన్ని నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంటే ప్రభుత్వ పాఠశాలలో పెట్టే మధ్యాహ్న భోజన పథకానికి మరింత ఆదరణ పొందేందుకు ఇది ఎంతో దోహదపడుతుంది. రోజూ ప్రభుత్వం ద్వారా పెట్టే భోజనంతో పాటు స్వీటు, పండ్లు పంపిణీ చేయడం వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుంది. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. కడియం మండలంలో సోమవారం పలు పాఠశాలలలో సోమవారం విందు భోజనాలను ఏర్పాటు చేశారు. కడియపులంక, వేమగిరి, దుళ్ళ తదితర పాఠశాలల్లో ఈ భోజన ఏర్పాట్లు దాతల సహకారంతో చేశారు.

1న ఉచిత మెగా వైద్య శిబిరం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు ఒకటిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. పందలపాక గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు ఒకటిన మూలారెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక ఐఎంఏ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రకాల వ్యాధులతో పాటు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

20 గ్రాముల బంగారం చోరీ

కంబాలచెరువు: కుటుంబ సభ్యులు ఇంటిలో నిద్రిస్తుండగా 20 గ్రాముల బంగారాన్ని దొంగ అపహరించాడు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. శంభునగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు, అతడి కుటుంబ సభ్యులు ఈ నెల 26న రోజూ మాదిరిగానే ఇంటిలో నిద్రించారు. మర్నాడు ఉదయం లేచి చూసేసరికి ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉన్నారు. పరిశీలించగా బీరువాలోని 20 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఆర్‌పై సదస్సు


మాట్లాడుతున్న ఇన్‌కం ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్

ప్రకాశం నగర్: ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్ (ఐటీఆర్) సమర్పించడంపై సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయ పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ ఐటీఆర్ సమర్పించే విధానం, తప్పుడు రిఫండ్ క్లెయిమ్స్ చేస్తే తీసుకునే చర్యలు, ఇబ్బందులను వివరించారు. ఆదాయ పన్నులో కొత్త, పాత టాక్స్ విధానాలను తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో పాన్ కార్డును తప్పనిసరిగా లింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీవోలు ఎస్.వీరబాబు, ఎస్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్‌కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ విన్నవించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో గన్ని కృష్ణ మర్యాదపూర్వంగా కలిశారు.

ముంపు సమస్య తీరేదెప్పుడో..



హుకుంపేటలో పంచాయతీ ట్రాక్టర్‌పై ఇళ్లకు వెళుతున్న ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరద వల్ల నాలుగు రోజులుగా ముంపునకు గురైన బొమ్మూరు నేతాజీనగర్, హుకుంపేటలోని సావిత్రీ నగర్, రామకృష్ణనగర్, ఎంపీడీవో కార్యాలయం ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కందుల దుర్గేష్ సొంత నియోజకవర్గం, సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యను సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముంపు ప్రాంతాన్ని పరిశీలించినప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కార చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


హుకుంపేటలోని రామకృష్ణ నగర్‌లో ముంపునీరు

హుకుంపేట గ్రామంలో సావిత్రీ నగర్, రామకృష్ణ నగర్ వీధులన్నీ జలదిగ్బంధంలో ఉన్నాయి. పంచాయతీ టాక్టర్‌లోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ముంపునీటిలోనే పందులు స్వైరవిహారం చేయడంతో ప్రజలు హడలిపోతున్నారు.

ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి సత్కారం


ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న పలుకు స్కూల్ నిర్వాహకులు

రాజమహేంద్రవరం రూరల్: సంకల్పం సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాల నిర్వాహకురాలు గంట కనక దుర్గ, సత్యనారాయణ, విద్యార్థులు సోమవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని సత్కరించారు. ఇటీవల ఎమ్మెల్యే గోరంట్ల అసెంబ్లీలో పలుకు స్కూల్‌పై ప్రస్తావించి, ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆయనను స్కూల్ తరఫున సత్కరించారు.

నర్సరీలను సందర్శించిన తెలంగాణ అధికారులు


నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కడియం: హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఫారెస్టు బీట్ ఆఫీసర్ల బృందం సోమవారం కడియం మండలంలోని నర్సరీలను సందర్శించింది. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఇక్కడకు వచ్చినట్టు ఆ రాష్ట డీఎఫ్ఓ సీహెచ్ గంగారెడ్డి తెలిపారు. 12 రోజుల ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఈ నెల 22న హైదరాబాద్ నుంచి వరంగల్, ఏటూరి నాగారం, భద్రాచలం అటవీ ప్రాంతాలను సందర్శించి ఆంధ్రప్రదేశ్‌లోని మోతుగూడెం, చింతూరు, మారేడుమిల్లి, కోరంగి మడఅడవులు, రాజమహేంద్రవరం పుష్కరవనం పరిశీలించి, కడియం చేరుకున్నట్లు వివరించారు. నర్సరీలో మొక్కల వివరాలను కడియపులంక విజయదుర్గా నర్సరీ గార్డెన్స్ అధినేత తిరుమలశెట్టి బ్రహ్మాజీ వివరించారు.

కేంద్ర బడ్జెట్‌పై సమగ్ర విశ్లేషణ

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర బడ్జెట్‌పై సమగ్ర విశ్లేషణ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కే మాట్లాడుతూ ప్రభుత్వ బడ్జెట్‌కు ఒక కుటుంబ బడ్జెట్ అనేదే ప్రాతిపదికన్నారు. ఒక కుటుంబం ఆదాయ, వ్యయాలను సరిపోల్చుకుంటూ కుటుంబ నిర్వహణ పట్టికను రూపొందించుకుంటుందో అదే విధంగా దేశ బడ్జెట్ రూపకల్పన జరుగుతుందన్నారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డీవీ నాగేశ్వరరావు బడ్జెట్‌పై విశ్లేషించి, సమగ్రమైన సమాచారాన్ని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, అధ్యాపకులు డాక్టర్ షణ్ముఖరావు, రమేష్ కృష్ణ, లీలామోహన్‌రావు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో యువతకు విక్రయిస్తున్న ముఠాను శాటిలైట్‌సిటీలోని అక్కమ్మతల్లి కొండ వద్ద సోమవారం రాత్రి బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం కోనేరుపేటకు చెందిన పల్లపాటి దుర్గాప్రసాద్, పల్లపాటి రవివర్మ, కలవచర్లకు చెందిన గంధం సుబ్రహ్మణ్యం, తణుకుకు ఇద్దరు మైనర్లు గంజాయితో పట్టుబడ్డారు. బొమ్మూరు ఎస్సై బి.శ్రీను, సిబ్బందితో కలిసి దాడి చేసి వీరిని పట్టుకున్నారు. వారి నుంచి 8 కిలోల గంజాయి, రెండు ఆటోలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. నిందితులు విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి నగరంలో యువతకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. అలాగే వీరు చోరీ కేసులలో నిందితులుగా ఉన్నారు.